ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇప్పించే పేరుతో వారిని పోలీసు స్టేషన్‌లో అప్పగించిన ఘటనపై ఆ స్కూల్ హెచ్‌ఎం, ముగ్గురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేవారని ఎంఇఒ డి.రాముడు తెలిపారు. ఈ ఘటనపై రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. దీంతో డిఇఒ రవిసాగర్ జెడ్‌పి బాలుర హైస్కూల్ హెచ్‌ఎం గెడ జగ్గారావు, ఉపాధ్యాయులు విజయప్రకాష్, సుధాకర్‌రెడ్డి, గణపతిలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారని చెప్పారు.

గృహ ప్రవేశం.. లేనట్టేనా..!

- ముందుకు సాగని జగనన్న ఇళ్ల నిర్మాణం
- తొలుత సంక్రాంతి, తర్వాత ఉగాది అంటూ వాయిదాలు
- మళ్లీ ఏప్రిల్ రెండో వారం అంటూ ప్రచారం
- రెండు జిల్లాల్లోనూ లక్ష్యం చేరని ఇళ్ల నిర్మాణం
- ప్రభుత్వ అరకొర సాయంపై లబ్ధిదారులు పెదవివిరుపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జగనన్న కాలనీల్లో సామూహిక గృహ ప్రవేశాలు ఉగాదికి లేనట్టేనని తేలిపోయింది. నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు గృహాల నిర్మాణం పూర్తి కాకపోవడంతో గృహప్రవేశాల కార్యక్రమం మరోసారి వాయిదా పడినట్లు తెలుస్తోంది. తొలుత సంక్రాంతికి గృహప్రవేశాలు అని ప్రకటించి మళ్లీ ఉగాదికి మార్చారు. ఇప్పుడు మరోసారి ఏప్రిల్ రెండోవారం అంటూ ప్రకటనలు చేస్తున్నారు. గృహాలు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ముందుకు రాకపోవడంతో అధికారులకు ఏంచేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం కేవలం రూ.లక్షా 80 వేలు మాత్రమే గృహనిర్మాణాలకు అందిస్తోంది. ఈ సొమ్ము పునాదుల దశకు సైతం సరిపోవడం లేదు. అప్పు చేసి ఇళ్ల నిర్మానం చేసేందుకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. దీంతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం ముందుకు సాగని దుస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 1800 లేఅవుట్లలో 2.50 లక్షల ఇళ్లపట్టాలను ప్రభుత్వం అందించింది. తొలివిడతగా లక్షా 42 వేల ఇళ్లను నిర్మించాలని ప్రణాళిక రచించారు. జిల్లాల విభజన జరిగిన తర్వాత ఏలూరు జిల్లాలో లక్షా మూడు వేల ఇళ్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 72 వేల ఇళ్లు తొలి విడతలో నిర్మించాలని లక్ష్యం నిర్ధేశించారు. ఫిబ్రవరి నెలాఖరుకు ఏలూరు జిల్లాలో కేవలం 14 వేల ఇళ్ల నిర్మాణం మాత్రమే పూర్తయ్యింది. మరో 12 వేల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి ఉగాదికి గృహప్రవేశాలు చేయనున్నట్లు ప్రకటించారు. పశ్చిమలోనూ టార్గెట్‌కు అనుగుణంగా ఇళ్ల నిర్మాణం జరగలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉండటంతో ఉగాదికి చేయాల్సిన సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం మరోసారి వాయిదా పడినట్లు స్పష్టమవుతోంది. ఇళ్ల నిర్మాణంపై ప్రభుత్వం ఎంత ఒత్తిడి తెచ్చినా లబ్ధిదారులు ముందుకు రాకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. ప్రభుత్వం అవేమీ పట్టించుకోకుండా అధికారులపై తీవ్రమైన ఒత్తిడి తెస్తోంది.

తలలు పట్టుకుంటున్న అధికారులు

ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో అధికారులు ఇచ్చిన ప్లాన్ ప్రకారం పక్కాగా ఇల్లు నిర్మించాలంటే తక్కువగా లెక్కించినా రూ.ఎనిమిది లక్షలు వరకూ ఖర్చవుతున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. ప్రభుత్వ సాయం కేవలం రూ.లక్షా 80 వేలు మాత్రమే. అదనంగా రూ.ఆరు లక్షలు ఖర్చు చేస్తే తప్ప ఇల్లు పూర్తికాని పరిస్థితి నెలకొంది. ఇంటి స్థలం పట్టా అందుకున్న వారంతా నిరుపేద కుటుంబాలకు చెందినవారే. స్థలం లేని నిరుపేదలకు ప్రభుత్వం అనేక వడపోతల అనంతరం ఇంటి స్థలం ఇచ్చింది. రోజు గడవడమే కష్టంగా ఉన్న కుటుంబాలు రూ.లక్షలు అప్పుతెచ్చి ఏవిధంగా ఇల్లు నిర్మించగలరో ప్రభుత్వమే చెప్పాలి. అంతేకాకుండా ప్రభుత్వం ఇచ్చిన స్థలాలు అత్యధికచోట్ల ఊరుకు బాగా దూరంగా ఉన్నాయి. లేఅవుట్లలో రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి కనీస మౌలిక సదుపాయాలు సైతం ఇంకా ఏర్పాటు కాలేదు. అలాంటి ప్రాంతాల్లో రూ.లక్షలు అప్పు తెచ్చి ఇల్లు నిర్మించేందుకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. సిమెంట్, ఐరన్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇసుకకు సైతం పెద్దఎత్తున సొమ్ము చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇచ్చే సాయం ఇప్పుడిస్తున్న సొమ్ముకు మరో రెండు, మూడు లక్షలు పెంచితే లబ్ధిదారులు ముందుకొచ్చే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ సాయం పెంచకుండా ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు రావడం కష్టమని స్పష్టంగా తెలుస్తోంది. ఏప్రిల్‌లోనైనా గృహప్రవేశాలు జరుగుతాయో.. లేదోననే అనుమానం సైతం నెలకొంది. ఇంటి నిర్మాణం చేయకుంటే పట్టాలు వెనక్కి తీసుకుంటామంటూ అధికారులు బెదిరిస్తున్నప్పటికీ లబ్ధిదారులు ముందుకు రావడం లేదంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. లబ్ధిదారులను ఒప్పించలేక, ప్రభుత్వ ఒత్తిళ్లను తట్టుకోలేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.


విద్యార్థులకు నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

రూ.27.60 కోట్లు జగనన్న విద్యాదీవెన సొమ్ము జమ

33,655 మంది విద్యార్థులకు లబ్ధి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో జగనన్న విద్యాదీవెన పథకం కింద 2022, అక్టోబర్- డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి 33,655 మంది విద్యార్థులకు చెందిన 30,317 మంది తల్లుల బ్యాంక్ ఖాతాలకు రూ.27.60 కోట్లు నిధులు విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ ఆదివారం ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరులో నిర్వహించిన జగనన్న విద్యా దీవెన కార్యక్రమంలో కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో డబ్బు జమ చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఇన్‌ఛార్జి జెడి నాగరాణి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఎడి నీలకంఠ ప్రదాన్, గిరిజన సంక్షేమశాఖ డిడి పిఎస్.నాయుడు, మైనార్టీల సంక్షేమ శాఖ ఎఒ శ్రీనివాసరావు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నమూనా చెక్కును అందజేశారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెన పథకం కింద అర్హులైన పేద విద్యార్థులందరికీ ప్రభుత్వం పూర్తిస్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందజేస్తుందన్నారు. ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులు కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజు మొత్తాన్ని తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తోందన్నారు. జిల్లాలో 8,089 ఎస్‌సి విద్యార్థులకుగాను 7,367 మంది తల్లుల ఖాతాల్లో రూ.8.74 కోట్లు, 1412 మంది ఎస్‌టి విద్యార్థులకుగాను 1312 మంది తల్లుల ఖాతాల్లో రూ.0.63 లక్షలు, 15,315 మంది బి.సి విద్యార్థులకుగాను 13,685బీమంది తల్లుల ఖాతాల్లో రూ.11.19 కోట్లు, 3,071 మంది ఇబిసి విద్యార్థులకుగాను 2800 మంది తల్లుల ఖాతాల్లో రూ.2.82 కోట్లు, 871 మంది ముస్లిం మైనారిటీ విద్యార్థులకుగాను 755 మంది తల్లుల ఖాతాల్లో రూ.0.66 లక్షలు, 4510 మంది కాపు విద్యార్థులకుగాను 4060 మంది తల్లుల ఖాతాల్లో రూ.3.39 కోట్లు, 387 మంది క్రిస్టియన్ మైనారిటీ విద్యార్థులకుగాను 338 మంది తల్లుల ఖాతాల్లో రూ.0.26 లక్షలు వెరసి 33,655 మంది విద్యార్థులకు చెందిన 30,317 మంది తల్లుల ఖాతాల్లో రూ.27.60 కోట్లు జమ చేసినట్లు వివరించారు.

స్కీమ్ వర్కర్లపై నిర్బంధం దారుణం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20న విజయవాడలో ధర్నా చేపట్టనున్న అంగన్వాడీ వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరించడాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ ఖండించారు. ఆదివారం ఆయన స్థానిక సిఐటియు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికలు ముందు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని కోరుతూ విజయవాడలో ధర్నా నిర్వహించుకునేందుకూ ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య దేశంలో ఉంటూ జగన్ ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. జిల్లాలో పోలీసులు అర్ధరాత్రి పూట సిఐటియు నాయకులు, అంగన్వాడీ వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ఇళ్లకు వెళ్లి నోటీసులు ఇస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేశారని, వాటిని అమలు చేయమని అడగడమే నేరంగా కార్మికులపై ఇటువంటి నిర్బంధానికి పాల్పడుతున్నాడని విమర్శించారు. తెలంగాణ కంటే అంగన్వాడీలకు ఎక్కువ వేతనాలు ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి ఆ హామీని మర్చిపోయారని ఎద్దేవా చేశారు. ఆంధ్ర కంటే తెలంగాణలో రూ.మూడువేలు ఎక్కువ వేతనం ఉందని, అక్కడ రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ రూ.5 లక్షలు ఇస్తున్నారని తెలిపారు. మన రాష్ట్రంలో మాత్రం మొండిచెయ్యి చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం పథకం కార్మికులకు జగనన్న గోరుముద్ద పేరుతో మెనూ అమలు చేయాలని చెప్పి విద్యార్థికి రూ.ఆరు నుంచి రూ.8 వరకూ ఇస్తూ కార్మికులను తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుంటే మధ్యాహ్న భోజన కార్మికులను ఇబ్బందులకు గురి చేయడం దుర్మార్గమన్నారు. సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం పోలీసుల ద్వారా అమానుష చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని విధానాలు విడనాడాలని హితవు పలికారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు బి.సోమయ్య, కె.విజయలక్ష్మి, వి.సాయిబాబు పాల్గొన్నారు.

ముసునూరు మండలంలో తడిచిన పొగాకును పరిశీలిస్తున్న సిపిఎం నేత రాజు

టి.నర్సాపురంలో నేలనంటిన మొక్కజొన్న

పంట వర్షార్పణం.. నిర్వేదంలో రైతాంగం

ప్రజాశక్తి - ముసునూరు

ఉపరితల ద్రోణి ప్రభావంతో కురుస్తున్న అకాల వర్షాలకు మండలంలోని రైతులు దిగాలు పడ్డారు. పొగాకు, మిర్చి, మొక్కజొన్న పంటలు పూర్తిగా దెబ్బతినడంతో ఏం చేయాలో పాలుపోక లబోదిబోమంటున్నారు. ఎకరం సాగుకు దుక్కు మొదలు, నారుమళ్లు, ఎరువులు, క్రిమి సంహారక మందులు, కూలీల ఖర్చు ఇలా సుమారు ఎకరానికి రూ.75 వేల నుండి లక్ష రూపాయిల వరకు వెచ్చించామని వాపోతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో పందిళ్లపై అకాల వర్షం కురవడంతో సగానికి సగం పొగాకు తాడు ధర పడిపోతుందని తెలిపారు.

ప్రభుత్వం ఆదుకోవాలి..

మానికల పగిడియ్య, కౌలురైతు

నాకున్న ఎకరం భూమి కాకుండా ఐదెకరాల భూమిని ఎకరానికి రూ.25 వేలు కౌలుకు తీసుకుని పొగాకు సాగు చేశా. పంట మొత్తం పందిళ్లపై ఉండటంతో పూర్తిగా నష్టపోయే పరిస్థితి ఉంది. కోత సమయంలో కూలీలకే సుమారు రూ.రెండు లక్షలు పెట్టుబడి పెట్టాను. ఇప్పుడు ప్రభుత్వం ఆదుకోకపోతే బతకడమే కష్టం.

పూర్తిగా నష్టపోయాం..

టి.రంగమ్మ, మహిళా రైతు

నా సొంత భూమిలో సంవత్సర కాలంలో దుక్కు ఖర్చు రూ.పది వేలు, నారు కొనుగోలుకు రూ.పది వేలు, పైపాట్లుకు రూ.ఏడు వేలు, కూలీలు నాటు వేయడానికి, పిలక తీయడానికి సుమారుగా రూ.8 వేలు, క్రిమిసంహారక మందుల ఖర్చు రూ.9 వేలు, రసాయనిక, ఎరువులకు రూ.30 వేలు ఖర్చు, చివరిదశలో కోత ఖర్చు రూ.40 వేలు అవుతుంది. మరి ఇలా పండించి పందిళ్లకు వేలాడదీసి ఎండేదశలో కురిసిన వర్షం వల్ల పూర్తిగా నష్టపోయాం.

రైతులకు తక్షణ సాయం అందించాలి

జి.రాజు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి. దీనిపై సోమవారం స్పందన కార్యక్రమంలో తహశీల్దార్, వ్యవసాయ కార్యాలయాల వద్ద రైతులతో కలిసి ఆందోళన చేపట్టి వినతిపత్రం అందజేస్తాం.

ఉన్నతాధికారులకు నివేదిస్తా..

సిహెచ్.శ్రీనివాసరావు, ముసునూరు మండల వ్యవసాయాధికారి

మండలంలో సుమారు 600 ఎకరాల్లో పొగాకు సాగు ఉంది. అకాల వర్షాలతో పొగాకు రైతులు పూర్తిగా నష్టపోయే పరిస్థితి ఉంది. నష్టాలపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తాం. నష్టపరిహారం ఇచ్చేలా కృషి చేస్తాను.

తడిసిన మొక్కజొన్న

పోలవరం: మండలంలో ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. వర్షానికి పట్టిసీమ, ఇటుకలకోట, కొత్త పట్టిసీమ, గూటాల, వింజరం, ప్రగడపల్లి, ఎల్అండ్‌డిపేట, జిల్లెళ్లగూడెం, చేగొండపల్లి పంచాయతీల పరిధిలో వర్షం కురిసింది కురిసిన వర్షానికి కొత్త పట్టిసీమ గుటాల పట్టిసీమ గ్రామంలో కల్లాలపై ఆరబెట్టిన మొక్కజొన్న పంట తడిచి రైతులు పలు ఇబ్బందులకు గురయ్యారు.

826 ఎకరాల్లో పంట నష్టం

టి.నరసాపురం: మండలంలో శని, ఆదివారాల్లో కురిసిన అకాల వర్షాలకు వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. దీంతో పంట చేతికందే సమయానికి పంట నేలనంటడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని తిరుమలదేవిపేట, ఏపిగుంట తదితర గ్రామాల్లో భారీ వర్షాలు కురిశాయని, జిల్లాలో మండలంలోనే అధిక వర్షపాతం నమోదైందని అధికారులు చెబుతున్నారు. గాలులతో పాటు వడగండ్ల వాన కురవడంతో మండలంలో మొక్కజొన్న 475 ఎకరాల్లో, పొగాకు 265, అరటి 16, జీడిమామిడి 10, నిమ్మ 60 ఎకరాల్లో దెబ్బతిందని అధికారులు చెబుతున్నారు. అయితే తిరుమలదేవిపేట, వెలగపాడు తదితర గ్రామాల్లో పెంకుటిళ్లు, రేకుల షెడ్డు సైతం కూలాయని అధికారులు తెలిపారు.

పోలవరం మండలంలో తడిచిన మొక్కజొన్నను ఆరబెడుతున్న రైతు

వరి రైతులు విలవిల

గణపవరం: మండలంలో దాళా వరి పైరు ఈనిక దశలో ఉన్న సమయంలో వర్షాలు కురవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈనికదశలో వర్షం కురిస్తే గింజలు గట్టిపడవని, పైగా రాలిపోతాయని తెలిపారు. మండలంలో 11,780 ఎకరాల్లో రైతులు దాళ్వా సాగు చేశారు. ఇప్పటికే ఎకారానికి రూ.28 వేలు వరకూ వెచ్చించారు. తాజా పరిస్థితులతో మరింత పెట్టుబడి పెట్టాల్సి ఉందని వాపోయారు. గత సార్వాలోనూ నష్టపోయామని, తాజా వర్షాలతో దాళ్వా పంటకు నష్టం వాటిల్లుతుందని చెప్పారు.

25న దెందులూరు రానున్న సిఎం జగన్

వైఎస్ఆర్ ఆసరా 3వ విడత పథకం ప్రారంభం

ప్రజాశక్తి - దెందులూరు

ఈ నెల 25న వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమాన్ని ప్రారంభించడానికి మండల కేంద్రమైన దెందులూరుకు సిఎం జగన్మోహన్‌రెడ్డి విచ్చేయనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ టి.రఘురాంతో కలిసి కలెక్టర్ ప్రసన్నకుమార్, ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ, ఎంఎల్‌ఎ కొఠారు అబ్బయ్యచౌదరి సభా స్థలి కోసం పరిశీలన చేశారు. దెందులూరు హైవేను ఆనుకుని టిటిడి కళ్యాణ మండపం పక్కనే ఉన్న స్థలాన్ని పరిశీలించి బహిరంగ సభకు ఎంపిక చేశారు. దెందులూరు హైస్కూల్లో హెలీప్యాడ్ ఏర్పాటుకు నిర్ణయించారు. అయితే సిఎం పర్యటన షెడ్యూల్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

సిఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

సిఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, ఎక్కడా ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. ఆదివారం గంగన్నగూడెంలోని శ్రీకృష్ణ కన్వెన్షన్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, మండల అధికారులతో కలెక్టర్, ఎంఎల్‌ఎ అబ్బాయిచౌదరి సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఈ నెల 25న సిఎం జగన్ దెందులూరులో వైఎస్ఆర్ ఆసరా మూడో విడత పథకాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయి అధికారులకు ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి పూర్తి పర్యవేక్షణ జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు చేపడతారని, జిల్లాస్థాయి అధికారులకు వివిధ బాధ్యతలు అప్పగించారు. ఎంఎల్‌ఎ అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ సిఎం నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని, ఎటువంటి అసౌకర్యం లేకుండా కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అంతా కలిసికట్టుగా పని చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ, సిఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ టి.రాఘురాం, జెడ్‌పి సిఇఒ రవికుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

త్వరలో అంగన్వాడీ పోస్టుల భర్తీ

ఏలూరు: జిల్లాలోని ఐసిడిఎస్ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు, మినీ అంగన్వాడీ కార్యకర్తల ఖాళీలను భర్తీ చేయనున్నట్లు జిల్లా స్త్రీ, శిశుసంక్షేమ శాఖాధికారి కెవివిఎల్.పద్మావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమడోలు ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ సహాయకుల పోస్టులు రెండు, బుట్టాయగూడెం ప్రాజెక్ట్ పరిధిలో అంగన్వాడీ కార్యకర్త పోస్టులు మూడు, సహాయకుల పోస్టులు ఎనిమిది, చింతలపూడి పరిధిలో కార్యకర్తల పోస్టు ఒకటి, సహాయకుల పోస్టులు మూడు, ఏలూరు పరిధిలో కార్యకర్తల పోస్టులు నాలుగు, సహాయకుల పోస్టు ఒకటి, గణపవరం పరిధిలో కార్యకర్త పోస్టులు రెండు, సహాయకుల పోస్టులు నాలుగు, కైకలూరు పరిధిలో సహాయకుల పోస్టులు మూడు, కొయ్యలగూడెం పరిధిలో కార్యకర్త పోస్టు ఒకటి, సహాయకుల పోస్టులు ఆరు, మండవల్లి పరిధిలో కార్యకర్త పోస్టు ఒకటి, సహాయకులు పోస్టులు మూడు, నల్లజర్ల పరిధిలో కార్యకర్త పోస్టు ఒకటి, సహాయకుల పోస్టులు రెండు, నూజివీడుపరిధిలో కార్యకర్త పోస్టు ఒకటి, సహాయకుల పోస్టులు నాలుగు, మినీ అంగన్వాడీ కార్యకర్త పోస్టు ఒకటి, పెదపాడు పరిధిలో కార్యకర్త పోస్టులు రెండు, సహాయకుల పోస్టులు నాలుగు, మినీ అంగన్వాడీ కార్యకర్త పోస్టు ఒకటి, పోలవరం ప్రాజెక్ట్ పరిధిలో సహాయకురాలు పోస్టు ఒకటి, మినీ అంగన్వాడీ కార్యకర్త పోస్టు ఒకటి ఖాళీలున్నాయని తెలిపారు. ఈ ఖాళీల భర్తీకి సంబంధిత సిడిపిఒలు నోటిఫికేషన్లు జారీ చేస్తారని పేర్కొన్నారు.

వర్షాలకు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలులు, వడగండ్లతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నిమ్మగడ్డ నర్సింహా, కె.శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రాథమిక అంచనా ప్రకారం వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని క్షేత్రస్థాయి పరిస్థితిని బట్టి అర్థమవుతోందని పేర్కొన్నారు. ఇప్పటికే రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రధానంగా కౌలురైతులు అప్పులతో సతమతమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమయంలో వడగండ్లతో కూడిన వర్షాలు వారిని మరింత కుంగదీస్తున్నాయని, వీరికి తక్షణ ఆర్థిక సాయంతోపాటు పంట నష్ట పరిహారాన్ని సత్వరమే అందించాలని కోరారు. మిర్చి కళ్లాల మీద తడిచిపోవడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని మామిడి, మొక్కజొన్న, పొగాకు పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఉద్యాన పంటలపై ఆధారపడ్డ రైతులకు ఈ అకాల వర్షాలు, గాలులు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయని, దెబ్బతిన్న రైతాంగాన్ని ఆదుకునే విషయంలో ప్రభుత్వం ఉదారంగా, మానవతా దక్పథంతో వ్యవహరించాలని కోరారు. పంట నష్టం నమోదు చేపట్టి నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

చింతలపూడి: మండలంలో కురిసిన అకాల వర్షం, వడగండ్ల వానతో పంట నష్టపోయిన మామిడి, జీడిమామిడి, మొక్కజొన్న, మిర్చి రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం మండల కార్యదర్శి కనమతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సిపిఎం మండల కన్వీనర్ రామిశెట్టి సత్యనారాయణ ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు.

విద్యార్థులను లాకప్‌లో నిర్బంధించలేదు

జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

తొమ్మిదో తరగతి విద్యార్థులను పోలీస్ స్టేషన్ లాకప్‌లో నిర్బంధించి కొట్టలేదని జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ తెలిపారు. ఇటీవల స్థానిక జెడ్‌పి బాలుర పాఠశాలలో సీలింగ్ ఫ్యాన్ ధ్వంసం చేశారని ఆరోపణపై 9వ తరగతి విద్యార్థులను పోలీస్‌స్టేషన్లో అప్పగించడం, లాకప్‌లో పెట్టి దండించడం వంటి వార్తలపై ఎస్‌పి ఆదివారం విచారణ జరిపారు. స్థానిక అటవీశాఖ గెస్ట్‌హౌస్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. అనంతరం డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ మాట్లాడుతూ సీలింగ్ ఫ్యాన్ ధ్వంసం చేశారని ఆరోపణపై కౌన్సెలింగ్ ఇప్పించడానికి పాఠశాల ఉపాధ్యాయులు ముగ్గురు విద్యార్థులను పోలీస్ స్టేషనుకు తీసుకొచ్చారన్నారు. అప్పుడే స్టేషన్‌కు వచ్చిన ఎస్ఐ విద్యార్థులను తీసుకెళ్లడానికి తల్లిదండ్రులకు సమాచారం అందించినప్పటికీ వారు రావడం ఆలస్యం కావడంతో స్టేషన్ ప్రాంగణంలో కూర్చోబెట్టారని తెలిపారు. స్టేషన్ రిజిస్టర్‌లో నమోదు చేశాక విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగించారన్నారు. అయితే విద్యార్థులు భయం వల్ల పలు రకాలుగా మాట్లాడి ఉండొచ్చని తెలిపారు. ఇటువంటి సంఘటనలు ఎదురైనప్పుడు పోలీసులే పాఠశాలకు వెళ్లి కౌన్సెలింగ్ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఏదేమైప్పటికీ విద్యార్థులను పోలీస్ స్టేషన్‌కు తీసుకురాకూడదని స్పష్టం చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీస్ స్టేషన్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆయనతోపాటు డిఎస్‌పి కెవి.సత్యనారాయణ, సిఐ బాలసురేష్ బాబు, ఎస్ఐ సాగర్‌బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అరెస్టులు ఉద్యమాలను ఆపలేవు

ప్రజాశక్తి - వేలేరుపాడు

కార్మిక హక్కుల సమస్యలపై ఉద్యమిస్తున్న నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం సరికాదని సిఐటియు జిల్లా నాయకులు మడివి దుర్గారావు అన్నారు. విజయవాడలోని అలంకార్ సెంటర్లో 20వ తేదీన జరిగే ధర్నాకు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లను ధర్నాకు తీసుకువెళ్లవద్దంటూ ఆదివారం సిఐటియు జిల్లా నాయకులు మడివి దుర్గారావుకు స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి నోటీసులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే నాయకులను ముందస్తు అరెస్టులు చేయించడం ప్రభుత్వ పిరికిపంద చర్య అని అన్నారు.

నిడమర్రు : అక్రమ అరెస్టులు, నిర్బంధాలు మానుకోవాలని సిఐటియు నాయకులు అన్నారు. ఈ నెల 20వ తేదీన విజయవాడలో జరిగే స్కీం వర్కర్ల ధర్నాకు వెళ్లకూడదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమణారావుకు పోలీసులు ఆదివారం నోటీసు అందించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ ప్రజాస్వామిక విరుద్ధంగా కార్మిక హక్కులు కాలరాస్తూ ప్రభుత్వం ఇచ్చిన జిఒ నెంబర్ ఒకటిని రద్దు చేసి అక్రమ నిర్బంధాలు, అరెస్టులు మానుకోవాలన్నారు. నోటీసు ఇవ్వడాన్ని కోన శ్రీనివాసరావు, గౌర సత్యనారాయణ, కంచ వరప్రసాద్, వెలగలేటి మోహన ఖండించారు.

5న చలో ఢిల్లీ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు

ఏప్రిల్ ఐదో తేదీన జరుగుతున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఉపాధి హామీ చట్టం పటిష్టంగా అమలు చేయాలని, పేదలకు చెందిన భూములను వెంటనే ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక అన్నే భవనంలో పి.ఆనందరావు అధ్యక్షతన ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడారు. ఈ సమావేశంలో జాన్‌రాజు, నాగేంద్ర, సునీల్, వినోద్, గంగాధర్, సురేశురావు, పవన్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని పోతనపల్లితో పాటు పలు గ్రామాల్లో అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతు సోదరులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని జనసేన మండల అధ్యక్షులు అరెల్లి కృష్ణ డిమాండ్ చేశారు. తుపాను ప్రభావంతో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా మండలంలో పోతనపల్లి, పర్వతాపురం, బూరుగుగూడెం గ్రామాల్లో నష్టం వాటిల్లిన పొలాలను ఆదివారం ఆయన పరిశీలించారు. నష్టపోయిన రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు గ్రామ గ్రామాన తిరిగి పంట నష్టాన్ని అంచనా వేయాలని కోరారు. మొక్కజొన్న, పొద్దు తిరుగుడు, బొప్పాయి, మిర్చి రైతులకు నష్టం ఎక్కువగా జరిగిందన్నారు. రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

డబ్బులు వద్దు.. రేషన్ బియ్యం ఇవ్వండి

గోపాలపురంలో లబ్ధిదారుల ఆవేదన

ప్రజాశక్తి - కలిదిండి

మాకు డబ్బులు వద్దు.. రేషన్ బియ్యం ఇవ్వండని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని గోపాలపురంలో రేషన్ ఇచ్చేందుకు ఆదివారం రేషన్ వ్యాన్ వచ్చింది. రేషన్ బియ్యం కోసం లబ్ధిదారులు వ్యాన్ వద్దకు చేరారు. వేలిముద్ర వేయగానే బియ్యం బదులుగా రేషన్ డీలర్ డబ్బులు లబ్ధిదారుల చేతిలో పెట్టాడు. దీంతో అక్కడ ఉన్నవారంతా అవాక్కయ్యారు. బియ్యం ఇవ్వకుండా డబ్బులు ఇస్తున్నారేమిటని లబ్ధిదారులు ప్రశ్నించారు. వేలి ముద్రలు వేసి డబ్బులు తీసుకోవాలని, లేకుంటే వచ్చే నెల కూడా రేషన్ రాదని, రేషన్ కార్డులు కూడా రద్దు చేస్తారని సమాధానం రావడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. నిరుపేదలమైన తమకు బియ్యమే కావాలని చెప్పారు. దీంతో సదరు వ్యక్తి రేషన్ వ్యాన్‌తో అక్కడ నుంచి వెనుతిరిగాడు. తమకు ఎప్పటి లాగే రేషన్ బియ్యం ఇచ్చేలా అధికారులు తగు చర్యలు చేపట్టాలని లబ్ధిదారులు కోరారు.

నేరాలు - ఘోరాలు

కారు ఢీకొని ఎస్ఐకు గాయాలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఎస్ఐను కారు ఢీకొనడంతో అతను తీవ్రగాయాలపాలైన ఘటన ఏలూరు నగరంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. నగరంలోని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వి.రామకోటేశ్వరరావు ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన ఆదివారం విధుల నిమిత్తం స్టేషన్‌కు వచ్చి తిరిగి బైక్‌పై ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో ఫైర్‌స్టేషన్ సమీపంలో యూటర్న్ తీసుకుంటుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయాలపాలైన ఎస్ఐను స్థానికులు 108 వాహనంలో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆయన కాలికి శస్త్ర చికిత్స చేయాలని చెప్పారు. కుటుంబ సభ్యులు ఆయనను ఏలూరు సర్వజన ఆసుపత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు డ్రైవర్ ఆగకుండా వెళ్లిపోయాడు. స్థానికులు అతడిని వెంబడించి ఏలూరు కొత్త బస్టాండ్ సమీపంలో కారుని ఆపి పోలీస్‌స్టేషన్ కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ప్రజాశక్తి - పోలవరం

రోడ్డు ప్రమాదంలో మహిళ తీవ్ర గాయాలపాలైన ఘటన మండలంలోని పట్టిసీమ ఎత్తిపోతల పథకం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా గండి పోచమ్మ దర్శనం కోసం తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం గ్రామానికి చెందిన అంకోలు సత్యనారాయణ అతని భార్య దుర్గాప్రసన్న తమ పిల్లలతో బైక్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో పట్టిసీమ ఎత్తిపోతల పథకం వద్ద రోడ్డుపై ఉన్న భారీ గోతిలో బైకు టైరు పడి పైకి లేవడంతో వెనుక ఉన్న దుర్గాప్రసన్న రోడ్డుపై పడింది. తలకు గాయాలు కావడంతో పోలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన వైద్యాధికారి రేణుక మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం సిఫార్సు చేయడంతో 108 వాహనంలో రాజమహేంద్రవరం తరలించారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని మక్కినవారిగూడెం పరిధిలో ఉన్న సీతంపేటలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ సతీష్‌కుమార్ తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2300 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కుమార్తె కనిపించడంలేదని తల్లి ఫిర్యాదు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

బంధువు ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన కుమార్తె తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎఎస్ఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని రాచన్నగూడెం గ్రామానికి చెందిన కట్ట రమాదేవికి ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె హర్షిత ఈ నెల 18వ తేదీన సాయంత్రం గ్రామంలోని బంధువు ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లి రమాదేవి కుమార్తె ఆచూకీ కోసం ప్రయత్నించింది. ఫలితం లేకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కోడిపందేల శిబిరంపై దాడి

జీలుగుమిల్లి :మండలంలోని పి.అంకంపాలెం గ్రామ శివారులో కోడిపందేల శిబిరంపై ఎఎస్ఐ ఎన్.నాగేశ్వరరావు తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఒక కోడి పుంజును, రూ.4910 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నగరంలోని గన్‌బజార్ సెంటర్ మసీదు ప్రాంతంలో రైలు పట్టాలు దాటుతోన్న వ్యక్తిని గూడ్స్ రైలు ఢీ కొనటంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మసీదు సెంటర్ వద్ద సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయసు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన అతడిని రైల్వే పోలీసులు ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రికి తరలించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

పది పరీక్షల్లో విజయమే లక్ష్యం

నూటికి నూరు శాతం ఉత్తీర్ణతకు కృషి

కె.రాంబాబు, జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, గణపవరం

గణపవరం : పబ్లిక్ పరీక్షల్లో పదో తరగతి విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని గణపవరం జిల్లా పరిషత్ హైస్కూల్ (బాలుర) ప్రధానోపాధ్యాయులు కె.రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ తమ హైస్కూలులో పదో తరగతి విద్యార్థులు 107 మంది ఉన్నారని చెప్పారు. వారిలో 96 మంది బాలురు, 11 మంది బాలికలు ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులను పదో తరగతి పరీక్షలకు సిద్ధం చేయడానికి ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు ఏర్పాటుచేసి వారికి అన్ని సబ్జెక్టులపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. గతేడాది 85 శాతం ఉత్తీర్ణత సాధించామని, ఈ ఏడాడి నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా వారిని పరీక్షలకు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

విజయకేతనంతో విజయం సాధిస్తాం

అంబటి అనురాధ, జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, గణపవరం

గణపవరం : విద్యాశాఖ సూచించిన విజయకేతనం ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇచ్చి పదో తరగతి పరీక్షల్లో విజయానికి కృషి చేస్తున్నామని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంబటి అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో మాట్లాడారు. తమ హైస్కూలులో 89 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారని చెప్పారు. విద్యార్థులకు ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి పరీక్షలకు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. గతేడాది 76 శాతం ఉత్తీర్ణత సాధించామని, ఈ ఏడాది విజయకేతనం ద్వారా నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించడానికి కషి చేస్తున్నామని చెప్పారు. పరీక్షలంటే భయపడుతున్న విద్యార్థులకు మనోధైర్యం కల్పించి వారిని పరీక్షలకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి సబ్జెక్టు కు ఆయా ఉపాధ్యాయులను ఏర్పాటు చేసి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు

ఉత్తమ జిపిఎ సాధనకు కసరత్తు

జంగారెడ్డిగూడెం : పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధనకు ఉపాధ్యాయులు కసరత్తు చేస్తున్నారు. ఇటీవల జిల్లాలో విద్యాశాఖాధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో 40 రోజుల పాటు ప్రత్యేక ప్రణాళికతో అమలు చేస్తున్న విజయకేతనం కార్యక్రమంపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించారు. పదో తరగతి విద్యార్థులు చదువులో చూపుతున్న ప్రతిభ ఆధారంగా ఎబిసిడి గ్రేడులుగా కేటాయించి వెనుకబడిన సి డి గ్రేడుల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణ, మండల ప్రాంతంలో 12 ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ జిపిఎ సాధించేందుకు ఎప్పటికప్పుడు విద్యాశాఖ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ క్రమంలో విజయకేతనం కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రత్యేక ప్రశ్నావళిని కూడా సిద్ధం చేశారు. 20వ తేదీ ఫిబ్రవరి 2023 నుంచి మార్చి 30వ తేదీ వరకు విజయకేతనం కార్యక్రమం ప్రత్యేకంగా నిర్వహించనున్నారు.

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

గెడ జగ్గారావు, జెడ్‌పిహెచ్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జంగారెడ్డిగూడెం

పాఠశాలలో పదో తరగతి విద్యార్థులందరూ నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేస్తున్నామని జంగారెడ్డిగూడెం జెడ్‌పిహెచ్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గెడ జగ్గారావు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మరింత ప్రోత్సహిస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. ఏదేమైనా ఈ ఏడాది జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పది పరీక్షల్లో విద్యార్థులు విజయ కేతనం ఎగురవేస్తారని ఆశిస్తున్నామని తెలిపారు.

విద్యార్థులకు మెరుగైన శిక్షణ : ఎంఇఒ బుద్ధుల రాముడు

పదో తరగతి విద్యార్థులు అధిక శాతం ఉత్తీర్ణత సాధించడానికి మెరుగైన శిక్షణ కల్పించే విధంగా పర్యవేక్షణ చేస్తున్నామని మండల విద్యాశాఖాధికారి బుద్ధుల రాముడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ మెరుగైన శిక్షణకు విజయకేతనం కార్యక్రమం దోహదపడుతుందని చెప్పారు. గతేడాది కరోనా కారణంగా జంగారెడ్డిగూడెం పట్టణ మండల ప్రాంతంలో 35 శాతం మాత్రమే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ ఏడాది 1847 మంది పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. ఈ నేపథ్యంలో పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా మెరుగైన శిక్షణ కల్పిస్తున్నామని తెలిపారు.

మెరుగైన ఫలితాలు సాధించేందుకు తపన

వి.ప్రభుదాస్, జెడ్‌పి హైస్కూల్ హెచ్ఎం, ముదినేపల్లి

ముదినేపల్లి : పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలనే తపనతో ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తున్నామని ముదినేపల్లి జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వి.ప్రభుదాస్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తున్నామని తెలిపారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని చెప్పారు. మెరిట్ విద్యార్థులతో పాటు వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. విజయకేతనం కార్యక్రమం ద్వారా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నామన్నారు. ఒక్కో ఉపాధ్యాయుడు పదిమంది విద్యార్థులను దత్తత తీసుకుని ప్రత్యేక తరగతులను నిర్వహించి సబ్జెక్టుల వారీగా బోధన చేస్తున్నామని తెలిపారు. ఫోన్‌ద్వారా తల్లిదండ్రులకు సలహాలు, సూచనలు ఇస్తూ తమ పిల్లలను ఇంటి వద్ద ప్రణాళికా బద్ధంగా చదివేలా, వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకునేలా సూచిస్తున్నామని చెప్పారు. పరీక్షలు ముగిసే వరకు టివిలకు, సెల్‌ఫోన్లకు పిల్లలను దూరంగా ఉంచాలని సూచించామని తెలిపారు.

మల్లు స్వరాజ్యం చరిత్ర భావితరాలకు ఆదర్శం

సుందరయ్యనగర్‌లో వర్ధంతి సభలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - వేలేరుపాడు

వీరనారి మల్లు స్వరాజ్యం చరిత్ర భావితరాలకు ఆదర్శమని సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్ అన్నారు. మండలంలోని సుందరయ్య నగర్‌లో ఆదివారం మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్ మాట్లాడుతూ మల్లు స్వరాజ్యం అనే పేరు యావత్ తెలంగాణకే కాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా పరిచయం అక్కర్లేదన్నారు. మల్లు స్వరాజ్యం గొప్ప పోరాట యోధురాలని కొనియాడారు. ఆమె 500 వందల ఎకరాల భూస్వామ్య కుటుంబంలో జన్మించిందన్నారు. 14 ఏళ్ల వయసులోనే తెలంగాణ సంస్థానంలో దొరల భూస్వామ్యుల ఆగడాలకు వ్యతిరేకంగా అన్న భీమిరెడ్డి నర్సింహారెడ్డి చేయి పట్టుకొని అడవులకు వెళ్లి 21 సంవత్సరాల వరకు ఇంటి ముఖం చూడలేదన్నారు. ఆమె దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా పోరాడారని కొనియాడారు. 60 ఏళ్ళ ప్రజా పోరాటంలో ఉండి చివరి శ్వాస వరకు నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడిన నిండైన జీవితం ఆమెది అని అన్నారు. ఆమె జీవితం, పోరాటాల చరిత్ర భావితరాలకు ఆదర్శమన్నారు. సిపిఎం జిల్లా నాయకులు మడివి దుర్గారావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమెకు ప్రత్యేక పేజీ ఉంటుందని గుర్తు చేశారు. స్వరాజ్యం ఆశయాల కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పూసం రాంబాబు, కారం వెంకట్రావు, మంగరాజు, దుర్గమ్మ, నాగమణి పాల్గొన్నారు.

నిడమర్రు : వీరనారి మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సభ మండలంలోని భువనపల్లిలో సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో గవర సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణరావు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోన శ్రీనివాసరావు, వలపు రమణ, అలుమోలు వరం, చింతల నాగేశ్వరరావు, అలమండ రాము పాల్గొన్నారు.



మల్లు స్వరాజ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బాధిత కుటుంబాలకు సాయం అందిస్తున్న డాక్టర్లు

అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు సాయం

ప్రజాశక్తి - వేలేరుపాడు

ఆపదలో ఉన్న వారిని ఎల్లప్పుడూ ఆదుకుంటామని భద్రాచలం పట్టణానికి చెందిన స్వాతి పిల్లల హాస్పిటల్ డాక్టర్ రాజశేఖర్ అన్నారు. కన్నాయిగుట్టలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో నిరాశ్రయులైన బాధితులకు ఆదివారం సాయం అందించారు. సిపిఎం కుక్కునూరు మండల కమిటీ ద్వారా తెలుసుకున్న స్వాతి పిల్లల హాస్పిటల్ డాక్టర్ రాజశేఖర్, అతని మిత్రులు లండన్‌లోని ప్రముఖ డాక్టర్ విశ్వ నారాయణ సహకారంతో అగ్ని ప్రమాద బాధితులు 27 కుటుంబాలవారికి ఒక్కొక్క కుటుంబానికి రూ.వెయ్యి నగదు, బిందెలు, దుప్పట్లు, బట్టలు, వంట పాత్రలు అందించారు. ఆ గ్రామంలో అనారోగ్యంగా ఉన్న చిన్నపిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి సుమారు రూ.50 వేల విలువైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ కన్నాయిగుట్టలో జరిగిన అగ్ని ప్రమాదం గురించి సిపిఎం కుక్కునూరు మండల కమిటీ ద్వారా తెలుసుకొని బాధితులకు సహాయం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతి ల్యాబ్ శ్రీనివాసరావు, సిపిఎం కుక్కునూరు, వేలేరుపాడు మండల కార్యదర్శులు వై.నాగేంద్రరావు, ధర్ముల రమేష్, సిపిఎం నాయకులు మహబూబ్ పాషా, మడివి దుర్గారావు, కోట రామలక్ష్మి, మేడిపల్లి బాబు, వలీ పాషా పాల్గొన్నారు.

హేలాపురి లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

ప్రజాశకి - ఏలూరు

హేలాపురి లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని పలువులు అన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 316 జి రీజియన్-1 మహాసభ (మీట్) రీజియన్ ఛైర్మన్ లయన్ వి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన స్థానిక హేలాపురి లయన్స్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. ప్రేరణ పేరుతో ఆత్మీయ సమావేశం, సేవా మహోత్సవం నిర్వహించారు. పేద విద్యార్థులకు సైకిళ్లు, మహిళలకు కుట్టుమిషన్లు, వికలాంగులకు ట్రై సైకిళ్ల లయన్స్ జిల్లా గవర్నర్ డాక్టర్ వికె.పంకజాక్షన్ చేతులమీదుగా అందించారు. ముఖ్య అతిథిగా లయన్ డాక్టర్ విఎస్‌విడి.ప్రసాద్, ఆత్మీయ అతిథులుగా లయన్స్ ఉప గవర్నర్లు గట్టిం మాణిక్యాలరావు, కాకరాల వేణుబాబు హాజరయ్యారు. అనంతరం రీజియన్‌లో ఉత్తమ సేవ చేసిన క్లబ్బులకు,వ్యక్తులకు అవార్డులు అందించారు.

అకాల వర్షం... అపార నష్టం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు మినుము రైతు నట్టేట మునిగాడు. మండలంలో 20 శాతం రైతుల చేల్లో మినుము పైరు గుట్టలుగా, పనలపై ఉంది. దీంతో కురుస్తున్న వర్షాలకు పనలపై ఉన్న మినుము పూర్తిగా తడిసిపోయింది. నాలుగు రోజులుగా పైరు నీటిలో నానడంతో రైతులు లబోదిబోమంటున్నారు. నీటిలో ఉన్న పంట నాని పోయి గింజ మొలక వస్తుందని రైతులు చెబుతున్నారు. రంగుమారిన, మొలకవచ్చిన పంటను కొనేందుకు ఎవరూ ముందుకు రారని రైతులు ఆవేదన చెందుతున్నారు.

చింతలపూడి :ఆదివారం కురిసిన వర్షానికి రేచర్ల గ్రామంలో పసుపులేటి మురళికి చెందిన ఏడు ఎకరాల పొగాకు నేలకొరిగింది. బోయగూడెం గ్రామానికి చెందిన కొవ్వూరు లూర్దురాజుకు చెందిన మూడు ఎకరాలకు పైగా మొక్కజొన్న పంట తీవ్రంగా దెబ్బతింది. మామిడి, జీడిమిమిడి పంట కోతకు వచ్చిన సమయంలో అకాల వర్షంతో నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు.

పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభం

గణపవరం : శనివారం రాత్రి గాలి, వర్షానికి మండల కేంద్రమైన గణపవరం శివారు గొల్లల దిబ్బ వద్ద విద్యుత్ స్తంభం పక్కకు ఒరగింది. ఆ స్తంభం పూర్తిగా పడిపోకుండా విద్యుత్ శాఖ అధికారులు ఆదివారం నిచ్చెన అడ్డంపెట్టి వదిలివేశారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్తంభం మార్చకుండా వెళ్లిపోయిన అధికారుల పనితీరుపై స్థానికులు విమర్శలు చేస్తున్నారు. ఈ విషయంపై వివరణ కోసం స్థానిక విద్యుత్ ఎఇకి ప్రజాశక్తి ఫోన్ చేసినా అందుబాటులోకి రాలేదు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై పోరాటం

ఎఐటియుసి రాష్ట్ర కార్య నిర్వహణ అధ్యక్షులు చలసాని వెంకట రామారావు

ప్రజాశక్తి - చింతలపూడి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ఉద్యోగ వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు ఎఐటియుసి కార్యకర్తలు సన్నద్ధం కావాలని ఎఐటియుసి రాష్ట్ర కార్య నిర్వహణ అధ్యక్షులు చలసాని వెంకట రామారావు పిలుపునిచ్చారు. చింతలపూడి మార్కెట్ యార్డ్ ఆవరణలో ఎఐటియుసి చింతలపూడి ఏరియా ద్వితీయ మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ మహాసభకు ఎఐటియుసి ఏరియా అధ్యక్షులు కంకిపాటి బుచ్చిబాబు అధ్యక్షత వహించారు. తొలుత ఎఐటియుసి పతాకాన్ని పట్నాల రామిరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఎఐటియుసి ఏరియా కార్యదర్శి తొర్లపాటి బాబు గత మహాసభ నుంచి ఇప్పటివరకు ఎఐటియుసిలో పనిచేస్తూ చనిపోయిన కార్మికులకు సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా మహాసభ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ముఖ్యఅతిథిగా విచ్చేసిన చలసాని రామారావు మాట్లాడు తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ఉద్యోగ వ్యతిరేక విధానాలపై కార్మికుల పోరాడాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ స్వతంత్ర పోరాటంలో పాల్గొన్న ఏకైక కార్మిక సంఘం ఎఐటియుసి అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మామిళ్లపల్లి వసంతరావు, ఎఐటియుసి జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, జిల్లా కో కన్వీనర్ చాట్ల పుల్లారావు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు టివిఎస్.రాజు, సీనియర్ నాయకులు జంగా రామచంద్రారెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శి పుల్లూరు సోమశేఖర్ మాట్లాడారు. ఏరియా కార్యదర్శి తోర్లపాటి బాబు గత మహాసభ నుంచి ఇప్పటివరకు జరిగిన కార్యకలాపాల రిపోర్టును ప్రవేశపెట్టారు.

నేత్రాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు

పోణంగి పాఠశాలలో ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఆశ్రమ ఆసుపత్రి వైద్య బృందంతో ఆదివారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 250 మంది విద్యార్థులకు వంద మంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఇచ్చారు. కళ్లజోళ్లు అవసరమైన వారిని, కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించారు. వీరందరికీ ఉచిత కళ్లజోళ్లు అందించి అవసరమైనవారికి ఆపరేషన్ చేయించనున్నట్లు తెలిపారు. డాక్టర్ వై.రమ్య, ఆశ్రమ ఆసుపత్రి పిఆర్ఒ పి.ఆనంద్, టెక్నీషియన్ హారిక, ఎస్.విజయ వైద్య పరీక్షలు చేశారు. ఏలూరు స్మార్ట్ సిటీ క్లబ్ పూర్వపు అధ్యక్షులు పి.మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మార్గాని శ్రీనివాస్, జిల్లా నాయకులు లేళ్ళ వెంకటేశ్వరరావు, లయన్స్ జిల్లా రీడింగ్ యాక్షన్ ప్రోగ్రాం ఛైర్‌పర్సన్ విజిఎంవిఆర్.కృష్ణారావు, క్లబ్ డైరెక్టర్ బి.సురేంద్ర, క్లబ్ కోశాధికారి షేక్ ముస్తఫా అలీ పాల్గొన్నారు. ఎల్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ వారు పోణంగి పాఠశాలలో అనేక కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఆరోగ్య సంబంధ పరీక్షలు ఎప్పటికప్పుడు చేయించుకోవాలన్నారు. నేత్రాల విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ వహించాలన్నారు. ఆకుకూరలు, కాయకూరలు తాజా పండ్లు తినడం వల్ల కంటికి సంబంధిన వ్యాధులకు గురికాకుండా ఉంటారన్నారు. అన్ని అవయవాల్లో కన్ను ప్రధానమని, విద్యార్థులు కంటిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందుల రాంబాబు, కె.దేవీప్రసాద్, జిజెఎ.స్టీవెన్, ఎ.ఆంజనేయస్వామి, గణేష్, శ్యామలాదేవి, కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమడోలు సుగర్స్ మాజీ ఛైర్మన్ ప్రసాద్‌రావు మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు



ప్రసాద్‌రావు (ఫైల్)

కాంగ్రెస్ సీనియర్ నాయకులు, భీమడోలు సుగర్స్ మాజీ ఛైర్మన్ సుంకవల్లి వెంకటప్రసాద్‌రావు (87) ఆదివారం మృతి చెందారు. అస్వస్థకు గురై హైదరాబాదులో రెండు నెలల నుంచి చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం మృతి చెందారు. ఆయన ఈ ప్రాంతంలో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదిం చారు. భీమడోలు సుగర్ ఫ్యాక్టరీ ఛైర్మన్ పనిచేశా రు. కాంగ్రెస్ పార్టీలో అత్యంత నాయకుడిగా ఢిల్లీ స్థాయిలో మంచి పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి.

బడ్జెట్‌లో గిరిజనులకు అన్యాయం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రాష్ట్ర బడ్జెట్‌లో గిరిజనులకు అన్యాయం జరిగిందని, గిరిజన సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని గిరిజన సంఘం జిల్లా నాయకులు తెల్లం దుర్గారావు విమర్శించారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన గిరిజన సంఘం మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో గిరిజనులకు రూ.20 వేల కోట్లకు పైగా కేటాయించాల్సి ఉండగా రూ.6900 కోట్లు మాత్రమే కేటాయించి గిరిజన సంక్షేమానికి పెద్దపీట వేశామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ నెల 26, 27 తేదీల్లో రెండు రోజుల పాటు మండల కేంద్రంలో గిరిజన సంఘం జిల్లా మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభను జయప్రదం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పాయం లక్ష్మణరావు, దావీదు శంకరుడు, ప్రజాసంఘాల నాయకులు అప్పారావు, కొండలరావు పాల్గొన్నారు.

ఎంఎల్‌సిల విజయంపై టిడిపి నేతల హర్షం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులు మూడు చోట్ల విజయం సాధించడంపై మండలంలోని రావిచర్లలో టిడిపి నూజివీడు నియోజకవర్గ సీనియర్ నాయకులు, రావిచర్ల గ్రామ సర్పంచి కాపా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ నేతలు ఆదివారం హర్షం వ్యక్తం చేస్తూ బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహానికి నివాళులర్పించారు.

చాట్రాయి : ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి మూడు స్థానాలు కైవసం చేసుకున్న సందర్భంగా ఆదివారం చాట్రాయిలోని టిడిపి కార్యాలయం వద్ద ఆ పార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి మండల మండల ప్రధాన కార్యదర్శి పలగాని దుర్గారావు మాట్లాడుతూ రానున్న జనరల్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. బాణసంచి కాల్చి కార్యకర్తలకు స్వీట్లు పంచిపెట్టారు.

జంగారెడ్డిగూడెం : స్థానిక అశ్వారావుపేట రోడ్డు ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద పట్టణ టిడిపి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు మాట్లాడారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బండివారిగూడెం పంచాయతీలో ఆదివారం జనసేన పార్టీ పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు సమక్షంలో ఇతర పార్టీల నుంచి 50 మంది జనసేనలో చేరినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు అడపా నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ జనసేనపై ప్రజల్లో స్పందన చూస్తే వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

డాక్యుమెంటు పోయినది

వెలిసి నాగేశ్వరరావు, తండ్రి: సోమరాజు గారి ఒరిజినల్ డాక్యుమెంటు నెం.1401/1990 గల సేల్ డాక్యుమెంటు పోయినది. తూర్పు గోదావరి జిల్లా, పెరవలి మండలం, కానూరు నుండి 17-03-2023వ తేదీన బ్యాంకు పని నిమిత్తం తణుకుకు ఆటోలో ప్రయాణిస్తూ తణుకు బైపాస్ రోడ్డు సమీపానికి వచ్చేసరికి నా ఒరిజినల్ డాక్యుమెంటులు గల కవరు కనిపించలేదు. చుట్టప్రక్కల ఎంత వెతికినా దొరకలేదు. ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రసుకు అందించగలరు.
పార్టీ వివరములు: డో.నెం. 5-71, కానూరు, పెరవలి మండలం, తూర్పు గోదావరి జిల్లా.

అరిగెల నాగేశ్వరరావు
అడ్వకేట్, తణుకు.
సెల్: 91103 82946

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో :: ఏలూరు జిల్లా
ఓ.ఎస్.నెం. 320/2021

బిట్వీన్:
ఇండియన్ బ్యాంక్, ఎన్.ఆర్.పేట, ఏలూరు ...ప్లెయింటిఫ్
మరియు
ఏపూరి కోటేశ్వరరావు వగైరా ...డిఫెండెంట్స్

టు:
1) ఏపూరి కోటేశ్వరరావు, తండ్రి: నాగభూషణం, R/o. డో.నెం. 6-44-2, బాపులపాడు, కృష్ణా జిల్లా.
2) మాకా సుధాకరరావు, తండ్రి: భాస్కరరావు, R/o. డో.నెం. 6-93/1, పెదిపేట, సిద్ధాంతం, పెనుగొండ మండలం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు గల దావాలో 1వ మరియు 2వ డిఫెండెంట్స్ హాజరు నిమిత్తం ది.25-04-2023 వ తేదీన వాయిదా అయి ఉన్నది. కావున పైన ఉదహరించిన 1వ మరియు 2వ డిఫెండెంట్స్ కోర్టు వారి ఎదుట ది.25-04-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు హాజరు కావలెను. లేని ఎడల వారి పరోక్షంగా తీర్మానించబడును.

బి.గౌరీశంకర్
అడ్వకేట్, ఏలూరు.
సెల్: 74162 36226